నేడు డిచ్‌పల్లిలో కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం

నిజామాబాద్ అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ పార్లమెంటరీ విస్తృతస్థాయీ సంఘ సమావేశం మంగళవారం జరగనుంది. డిచ్‌పల్లిలోని కేఎస్‌ఆర్ గార్డెన్‌లో మధ్యాహ్నం 3గంటలకు నిర్వహించనున్న ఈ సమావేశానికి రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీప్‌దాస్ మున్షీ, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌తో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి హాజరుకానున్నారు.


● మానిక్‌భండార్‌లో సర్వే చేస్తున్న అధికారులు

ఆలయాల భూములు అన్యాక్రాంతం!

» జిల్లాలో విలువైన దేవాదాయ భూముల కబ్జా
» ఏళ్ల తరబడి కౌలు తీసుకొని కబ్జా చేస్తున్నా పట్టింపులేదు
» ఎట్టకేలకు సర్వే చేపడుతున్న దేవాదాయ శాఖ అధికారులు
» సర్వేలో బయటపడ్డ కబ్జాలపై అధికారుల చర్యలు కరువు

నిజామాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో దేవాదాయ భూములపై పట్టింపు లేదు. ఏళ్లతరబడి అన్యాక్రాంతమవుతున్నా, కీలకమైన భూములన్నీ ఇతర చేతుల్లోకి వెళ్తున్నా పట్టించుకునే వారు లేరు. కౌలు పేరిట ఏళ్ల తరబడి తీసుకొన్న వాటిని తిరిగి స్వాధీనపరుచుకోవడం లేదు. దేవాలయ దస్త్రాల ప్రకారం సర్వే చేసి భూములను స్వాధీనం చేసుకోవాల్సి ఉన్నా.. నామమాత్రం చర్యలతో సరిపెడుతున్నారు. దేవాదాయ శాఖకు సిబ్బంది తక్కువగా ఉన్నా రెవెన్యూ, సర్వేల్యాండ్స్ శాఖతో పాటు ఇతర శాఖల సమన్వయంతో రక్షించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. కొన్ని భూములపై సర్వేలు నిర్వహించి హద్దులు పెడుతున్నా తిరిగి స్వాధీనం చేసుకోవడం లేదు. జిల్లా వ్యాప్తంగా కీలకమైన భూములు అన్యాక్రాంతం కావడంతో పాటు వెంచర్లతో పాటు ఇతరుల పేరిట పట్టాలుగా మారినా పట్టించుకోవడం లేదు. కొన్నింటిపై కోర్టు కేసులతో కాలయాపన చేస్తున్నారు. కబ్జా దారులకు రాజకీయ ప్రాబల్యం ఉండటంతో చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

జిల్లాలో 751 దేవాలయాలు

జిల్లా వ్యాప్తంగా 751 దేవాలయాలు ఉన్నాయి. వీటిలో 247 దేవాలయాలకు వ్యవసాయ భూములు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 2287 ఎకరాల భూమి ఉంది. వీటిలో మెట్ట 1949 ఎకరాలు ఉండగా, మాగాని 338 ఎకరాల భూమి ఉంది. కొన్ని దశాబ్దాల నుంచి ఈ భూములు ఈ దేవాలయాల పరిధిలోనే ఉన్నాయి. ఈ భూముల నుంచి వచ్చే ఆదాయాన్ని దేవాలయాల్లో దూపదీప నైవేద్యం కోసం వినియోగించేందుకు వీటిని అప్పుడు దేవాలయాలు నిర్మించిన వారు వీటిని ధానంగా ఇచ్చారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ భూములు దేవాలయాల పేరిట కొనసాగుతున్నాయి. ఈ దేవాలయాల పరిధిలోని భూములను ప్రతీ సంవత్సరం వేలం ద్వారా కౌలుకు భూములను ఇస్తున్నారు. గత కొన్నేళ్లుగా వేరేవారికి ఇవ్వకుండా కొంత మంది ఏళ్ల తరబడి కౌలు తీసుకోవడం వల్ల భూములు కబ్జాకు గురవుతున్నాయి. ఈ భూములకు ధరలు పెరగడం వల్ల నిజామాబాద్ నగరం పరిధిలోనే కాకుండా చుట్టుపక్కల భూములు కూడా కబ్జాకు గురయ్యాయి. నగరాన్ని ఆనుకొని ఉన్న పెద్దరాం మందిరానికి 200 ఎకరాలకు పైగా భూములు ఉన్నాయి. వీటిలో 100 ఎకరాల వరకు కబ్జాకు గురయ్యాయి. మోపాల్, మాక్లూర్, నిజామాబాద్ రూరల్ మండలాల పరిధిలోని భూములు ఎక్కువగా కబ్జా చేశారు. ఏళ్ల తరబడి కొంత మందికే కౌలుకు ఇవ్వడం వల్ల బినామీ పత్రాలను సృష్టించారు. కొన్నిచోట్ల పట్టాలను చేసుకున్నారు. మరికొన్ని చోట్ల భూములను వెంచర్లలో కలిపివేశారు. ఈ రాంమందిరంతో పాటు ఇతర దేవాలయాలకు సంబంధించి సుమారు 213 ఎకరాలు నగరం చుట్టు పరిధిలోనే కబ్జాకు గురైనట్లు అధికారులు గుర్తించారు. జిల్లాకు చెందిన దేవాదాయ భూములు ఆదిలాబాద్‌లో 149 ఎకరాలు, నాందేడ్ జిల్లాలో 117 ఎకరాలు కబ్జాకు గురైనట్లు అధికారులు లెక్కలు తేల్చారు. కొన్ని చోట్ల సర్వే కూడా నిర్వహించారు. కబ్జాలో ఉన్నవారు సర్వే చేయనివ్వకుండా అడ్డుకోవడం, రాజకీయ నేతల వల్ల ఒత్తిళ్లు తీసుకురావడం వల్ల గత రెండేళ్లుగా ముందుకు సాగడం లేదు. కలెక్టర్‌తో పాటు పలువురికి ఫిర్యాదు చేయడంతో ఈ మధ్యనే సర్వేల్యాండ్స్ రికార్డ్ అధికారులు కదిలారు. దేవాదాయ శాఖ అధికారులతో కలిసి ఈ సర్వేను నిర్వహిస్తున్నారు. సర్వే చేపడుతున్న వారు కీలకమైన హద్దులను ఇంకా నిర్ణయించడం లేదు. సర్వే వివరాలను అందించడంతో పాటు భూములను స్వాధీనం చేసుకునే విధంగా చర్యలు చేపట్టడం లేదు. గత ప్రభుత్వం హయాంలోనే దేవుళ్ల పేరుమీదనే దేవాదాయ భూములను పట్టాలు చేస్తామని చెప్పినా ఇప్పటి వరకు చేయలేదు. సర్వే చేసి భూముల వివరాలను గుర్తించిన చర్యలు తీసుకోలేదు.

నగరం చుట్టుపక్కల సర్వే..

నగరం చుట్టుపక్కల గడిచిన వారం రోజుల్లో సర్వే నిర్వహించారు. సుమారు 29 ఎకరాలు కబ్జాలో ఉన్నట్లు గుర్తించారు. న్యాల్‌కల్ రోడ్‌లో 20 ఎకరాల వరకు గుర్తించగా, మానిక్‌బండార్ ప్రాంతంలో వెంచర్లలో 9 ఎకరాల వరకు భూములు ఉన్నట్లు అంచనా వేశారు. ఇంకా మిగతా చోట్లలో కూడా భూముల వివరాలను గుర్తించడంతో పాటు సర్వే చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. నగరం చుట్టుపక్కల భూములకు ధరలు బాగా పెరగడం, ఎకరం 3 నుంచి 5 కోట్ల వరకు ఉండటం వల్ల కబ్జాదారులు ఎక్కువగా ఈ భూములపై దృష్టిపెట్టి ఏళ్ల తరబడి తిష్టవేస్తున్నారు. దేవాదాయ శాఖలను కొంతమంది అధికారులతో చేతులు కలిపి కౌలుకు తీసుకోవడంతో పాటు కబ్జా చేస్తున్నారు. ప్రతీ సంవత్సరం పరిశీలించవల్సిన అధికారులు పట్టించుకోకపోవడం వల్ల కోట్ల రూపాయల భూములు పక్కదారి పట్టాయి. ప్రజాప్రతి నిధుల ఒత్తిళ్లు, కిందిస్థాయి నేతలు కబ్జాదారులకు మదతు ఇవ్వడం వల్ల సర్వే కూడా ముందుకు సాగడం లేదు. కొన్ని భూములు వెంచర్లుగా మారి ఇతరులకు అమ్మకాలను కూడా చేశారు. మరికొందరి భూముల్లో ఇళ్ల నిర్మాణాలు కూడా జరిగాయి. ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకోవడంతో పాటు సర్వే చేస్తుండటంతో కొన్నవారిలోనూ ఆందోళన నెలకొంటుంది. దేవాదాయ శాఖ కార్యాలయం జిల్లాలో ఉన్న ప్రతీసారి ఇన్‌చార్జిలను నియమించడం వల్ల కనీసం పట్టించుకునేవారు లేరు. జిల్లా స్థాయిలో గానీ, రీజినల్ స్థాయిలో కానీ సమీక్షించకపోవడం వల్ల ఏళ్ల తరబడి భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. జిల్లాలో కీలకమైన దేవాదాయ శాఖలో పోస్టులను భర్తీ చేయడంతో పాటు విలువైన భూముల దస్త్రాలను డిజిటలైజ్ చేస్తే తప్ప ఈ కబ్జాలు ఆగే పరిస్థితి లేదు. ఒత్తిళ్లకు తలొగ్గకుండా కబ్జా అయిన భూములను సర్వే చేస్తే తిరిగి స్వాధీనం చేసుకునే అవకాశం ఉంది. దేవాదాయ భూములను కాపాడేందుకు సర్వేల్యాండ్స్ రికార్డ్ అధికారులతో కలిసి సర్వే నిర్వహిస్తున్నామని దేవాదాయ శాఖ ఇన్‌చార్జి కమిషనర్ రవీందర్‌గుప్త తెలిపారు. ఇప్పటికే 29 ఎకరాలను గుర్తించామని తెలిపారు. వాటితో పాటు ఇతర కబ్జా భూములను గుర్తించి స్వాధీనం చేసుకుంటామని ఆయన తెలిపారు.

జిల్లా ఓటరు జాబితా ప్రకటన

● జిల్లాలో మొత్తం ఓటర్లు 14,36,214మంది

నిజామాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఓటరు జాబితాను ప్రకటించింది. జిల్లాలోని ఆరు నియోకవర్గాలలో ఓటరు లిస్టును విడుదల చేసింది. జిల్లాలో ఆరు నియోజకవర్గాలలోని ఓటర్ల లిస్టును కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ప్రకటించారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల పరిధిలో 14లక్షల 36వేల 214 ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఇందులో పురుష ఓటర్లు 6లక్షల 77వేల 130 మంది ఉండగా మహిళ ఓటర్లు 7లక్షల 58వేల 5ఓటర్లు ఉన్నారు. వీరితోపాటు ఇతర ఓటర్లు 79 ఉన్నట్లు ప్రకటించారు. జిల్లాలోని మొత్తం దరఖాస్తులను పరిశీలించిన మీదట తుది జాబితాను విడుదల చేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ఇదే జాబితాను వినియోగించనున్నారు. ఆర్మూర్ నియోజకవర్గం పరిధిలో మొత్తం ఓటర్లు 2లక్షల 14వేల 136మంది ఉండగా, బోధన్‌లో 2లక్షల 24వేల 772మంది ఉన్నారు. బాన్సువాడలో 1లక్షల 98వేల 738మంది ఓటర్లు ఉన్నారు. నిజామాబాద్ అర్బన్‌లో 3లక్షల 7వేల 459ఓటర్లు ఉండగా, నిజామాబాద్ రూరల్‌లో 2లక్షల 60వేల 485మంది ఓటర్లు ఉన్నారు. బాల్కొండలో 2లక్షల 29వేల 624మంది ఉన్నట్లు జాబితాలో ప్రకటించారు.

ఈవీఎం గోదాం తనిఖీ


గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లోగల ఈవీఎం గోదాంను సోమవారం కలెక్టర్‌రాజీవ్ గాంధీ హన్మంతు సందర్శించారు. సాధారణ పరిశీలనలో భాగంగా క్షేత్ర స్థాయిలో తనిఖీ నిర్వహించారు. ఈవీఎం గోదాంకు వేసిన సీల్‌లను పరిశీలించి సీసీ టీవీలో బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్‌లు, వీవీప్యాట్‌లు, ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపర్చిన తీరును తనిఖీ చేశారు. ఈవీఎం గోదాం వద్ద పోలీసు బందోబస్తు తీరును పరిశీలించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రత విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, కార్తిక్, అగ్నిమాపక శాఖ అధికారి నర్సింగ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి ఆర్టీసీ 444 ప్రత్యేక బస్సులు

సుభాష్‌నగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సంక్రాంతి పండుగ కోసం ప్రత్యేక బస్సులను నడుపనున్నట్లు నిజామాబాద్ రీజియన్ మేనేజర్ జ్యోత్స్న తెలిపారు. పండుగ మూడు రోజుల పాటు సుమారు 444 ప్రత్యేక బస్సులను నడుపనున్నట్లు తెలిపారు. దూర ప్రాంతాలకు ప్రత్యేకంగా ఆంధ్ర ప్రాంతానికి వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్మూర్, బోధన్, నిజామాబాద్-1, 2, బాన్సువాడ, కామారెడ్డి నుంచి హైదరాబాద్, విజయవాడ వరకు స్పెషల్ బస్సులను నడుపనున్నట్లు తెలిపారు. జనవరి 9 నుంచి 12 వరకు, జనవరి 16 నుంచి 20 వరకు ఈ ప్రత్యేక బస్సులు ప్రయాణికుల సౌకర్యార్థం అందుబాటులో ఉంటాయని తెలిపారు. సంక్రాంతికి నడిపే పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో, ఎక్స్‌ప్రెస్ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించనున్నట్లు ప్రయాణ సమయంలో మహిళలు విధిగా జీరో టికెట్లను తీసుకోవాలని తెలిపారు.

కలగానే డిచ్‌పల్లి మున్సిపాలిటీ

» ప్రతీసారి ఎన్నికల సమయంలో మున్సిపాలిటీ ఏర్పాటుపై ప్రకటనలు
» అధికారంలోకి వచ్చాక పట్టించుకోని నాయకులు

7



బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రశ్నించిన వారిపై కేసులు

» ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దెబ్బతీశారు
» ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నింటినీ నెరవేరుస్తున్నాం
» విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నిజామాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రశ్నించేవారిపై కేసులు పెట్టారని పదేళ్ల పాటు మాటల గారడితో ప్రజలన్ని మోసం చేశారని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్, కేటీఆర్‌లు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని అన్నారు. రైతుబంధు పేరుమీద పడావు భూములకు కూడా ఇచ్చి నిధులను దుర్వినియోగం చేశారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పంట పండించే భూములకే రైతుభరోసాను ఇస్తామంటే బీజేపీ, బీఆర్ఎస్ నేతలు ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని ఆయన విమర్శించారు. రైతులు సాగు చేస్తే తప్పనిసరిగా రైతుభరోసా అందుతుందన్నారు. ఎకరాకు రూ.12వేల రూపాయలను సంవత్సరానికి అందిస్తారని ఆయన అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకే సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్ణయం తీసుకున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో ఏ ఒక్క పాఠశాలకు కూడా నిధులను కేటాయించలేదన్నారు. ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌళిక వసతులు కూడా లేకుండా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎమ్మెల్యేల నిధుల నుంచి కేటాయింపులు చేసి పాఠశాలలో అత్యవసర పనులను పూర్తి చేస్తున్నామన్నారు. ఇచ్చిన మాటప్రకారం రైతులు పండించే ధాన్యానికి బోనస్‌ను అందిస్తున్నామని ఆయన తెలిపారు. సంక్రాంతి నుంచి నిరుపేదలందరికి రేషన్ కార్డులను అందిస్తామని తెలిపారు. బీఆర్‌ఎస్ హయాంలో ఒక్కరికి కూడా రేషన్ కార్డులను అందించలేదన్నారు. భూమిలేని నిరుపేదలకు కూడా సంవత్సరానికి 12వేల రూపాయలను అందించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఇళ్లులేని నిరుపేదలకు ఇందిరమ్మ పథకం కింద ఇళ్లను మంజూరు చేస్తున్నామన్నారు. ఈనెల 26 నుంచి లబ్ధిదారులను ఎంపిక చేయడంతో పాటు ఇళ్ల నిర్మాణాలు చేపడుతామన్నారు. గత ప్రభుత్వం తప్పిదాల వల్లనే ఆర్థిక పరిస్థితి దిగజారిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కోక్క వ్యవస్థను సవరించుకుంటూ ముందుకు పోతున్నారని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు అన్ని అమలు చేస్తున్నారని అన్నారు. అరెస్టు భయంతోనే కేటీఆర్ ఇష్టం వచ్చిన రీతిలో మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ సీట్లను కైవసం చేసుకుంటుందన్నారు. ప్రతిపక్షాలు ప్రజలను మభ్యపెట్టేందుకే అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు.వారి మాటలను నమ్మవద్దని ఆయన కోరారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, నుడా చైర్మన్ కేశవేణు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నరాల రత్నాకర్, రాష్ట్ర ప్రచార కమిటీ మెంబర్ జావిద్ అక్రమ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు విపుల్‌గౌడ్, జిల్లా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు వేణురాజుతో పాటు సంతోష్, బొబ్బిలి రామకృష్ణ, ఈసా, అబ్దుల్ ఎజాజ్, అపర్ణ ఉన్నారు.


స్టేజ్‌పై డ్యాన్స్ చేస్తున్న హీరో వెంకటేష్, చిత్ర బృందం


మాట్లాడుతున్న సినీ నిర్మాత దిల్ రాజు, చిత్రంలో అర్బన్ ఎమ్మెల్యే

అట్టహాసంగా 'సంక్రాంతికి వస్తున్నాం' ట్రైలర్ లాంచ్

● ముఖ్య అతిథిగా హాజరైన అర్బన్ ఎమ్మెల్యే, హీరో వెంకటేశ్, నిర్మాతలు దిల్‌రాజు, శిరీష్

నిజామాబాద్ కల్చరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విక్టరీ వెంకటేశ్ హీరోగా శ్రీవెంకటేశ్వర క్రియేషన్ పథాకంపై దిల్‌రాజు, శిరీష్‌రెడ్డి నిర్మాణ సారథ్యంలో 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా ట్రైలర్ లాంచ్ అట్టహాసంగా సాగింది. హీరో విక్టరీ వెంకటేశ్, హీరోయిన్‌లు ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరిలు ఆటపాటలతో సందడి చేశారు. జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ మైదానంలో 'సంక్రాంతికి వస్తున్నాం' ట్రైలర్ లాంచ్‌ను ముఖ్య అతిథిగా హాజరైన అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, హీరో వెంకటేశ్, నిర్మాతలు దిల్‌రాజు, శిరీష్‌రెడ్డిలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. సంక్రాంతికి వస్తున్నాం సినిమా సంక్రాంతికి పండుగకు ప్రేక్షకులను అలరించనుందన్నారు. ఈ సినిమా బ్లాక్ బాస్టర్‌గా నిలవాలని మరిన్ని విజయవంతమైన చిత్రాలు దిల్‌రాజు, శిరీష్‌రెడ్డిలు తీయాలని ఆకాంక్షించారు. హీరో వెంకటేశ్ మాట్లాడుతూ.. కుటుంబ సమేతంగా చూడదగిన సినిమాను సంక్రాంతికి మీ ముందుకు వస్తున్నామని ప్రతి ఒక్కరూ ఈ చిత్రాన్ని ఆదరించాలని కోరారు. సినీ నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ.. మొదటి సారిగా నిజామాబాద్ పట్టణంలో ట్రైలర్ లాంచ్‌ను నిర్వహించడం ఆనందాన్నిస్తుందని అన్నారు. మీ మధ్యలోనే పెరిగి రూపాయి, చారన టికెట్‌తోనే సినిమాలు చూసి సినిమాకు నిర్మాతగా ఎదిగే స్థాయి అందుకున్నానన్నారు. గతంలో ఫిదా సినిమా నిర్మించి సక్సెస్‌మీట్‌ను జిల్లాలోనే జరుపుకున్నామని, ఇప్పుడు ట్రైలర్ లాంచ్ ద్వారా మరిన్ని చిత్రాలు నిజామాబాద్ కేంద్రంగా ఈవెంట్‌లు చేయడానికి ప్రయత్నిస్తానని అన్నారు. డి.రామానాయుడు నిర్మాతగా ఎన్నో విజయవంతమైన చిత్రాలు తీశారని వారిని ఆదర్శంగా తీసుకొని సినీ రంగానికి రావడం జరిగిందని అన్నారు. వెంకటేశ్వర క్రియేషన్స్ సంస్థ 55వ చిత్రంగా సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో మీ ముందుకు వస్తున్నామని ప్రేక్షకులు ఆదరిస్తారని ఆకాంక్షించారు. తన అభిమాన హీరో విక్టరీ వెంకటేశ్‌తో అత్యధికంగా నాలుగు చిత్రాలను నిర్మించడం గర్వంగా ఉందని అన్నారు. నిర్మాత శిరీష్‌రెడ్డి మాట్లాడుతూ.. బ్లాక్ బాస్టర్‌గా ఈ చిత్రాన్ని నిర్మించడంలో ప్రతిఒక్క ఆర్టిస్టు తనవంతు న్యాయం చేశారన్నారు. క్యారెక్టర్ ఆర్టిస్ట్ నరేష్ మాట్లాడుతూ.. సంక్రాంతికి విడుదలయ్యే ప్రతీ సినిమాను ప్రేక్షకులు విజయవంతం చేసిన రికార్డులు ఉన్నాయన్నారు. కుటుంబ సమేతంగా ప్రేక్షకులు ఈ సినిమా చూడాలన్నారు. దర్శకుడు అనీల్‌రావుపూడి మాట్లాడుతూ.. ప్రేక్షకులకు పెద్ద హిట్ సినిమాను అందించడానికి సినీయూనిట్ మొత్తం కష్టపడి పనిచేసిందన్నారు. ఈ సినిమాతో హీరో వెంకటేశ్ మరో కోణంలో కనిపిస్తారని అభిమానులకు పెద్ద పండుగను అందిస్తుందన్నారు. సినీ హీరోయిన్‌లు ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరిలు సినిమాలోని పాటలతో నృత్యాలు చేస్తూ ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. ప్రేక్షకుల ఉత్సాహాన్ని చూసి హీరో వెంకటేశ్, హీరోయిన్‌లు ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి, యాంకర్ శ్రీముఖి, క్యారెక్టర్ ఆర్టిస్ట్ నరేష్‌లు సైతం స్టేజిపైకి ఎక్కి డ్యాన్సులు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ దేవి థియేటర్ మేనేజర్ దాసరి నాగేశ్వర్‌రావు, కాంగ్రెస్ నాయకులు నరాల రత్నాకర్, కవి నరాల సుధాకర్, సినీ ఆర్టిస్టులు, జూనియర్ ఆర్టిస్టులు పాల్గొన్నారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న హమాలీలు

నిజామాబాద్ అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ హమాలీల సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ వద్ద సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆరు రోజుల నుంచి కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఓమయ్య అన్నారు. ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద పోలీసులను పెట్టి బియ్యం సరఫరా చేస్తున్నారని ఆయన విమర్శించారు. కమిషనర్ మరియు ప్రిన్సిపల్ సెక్రెటరీ ఒకరే అయినప్పటికీ పెరిగిన రేట్ల ప్రకారం వేతనాలు ఇవ్వడం లేదన్నారు. ఒప్పందం ప్రకారం జీవోను విడుదల చేయడం లేదన్నారు. కార్మికుల సమస్యలను ఆ శాఖ మంత్రి పట్టించుకోవడం లేదని విమర్శించారు. జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ ధర్నాలో జిల్లా కార్యదర్శి హన్మాండ్లు, దేవేందర్, భాజన్న, బాబర్, మౌలానా, హైమద్, రాజశేఖర్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

9న మైనార్టీ కమిషన్ చైర్మన్ రాక

నిజామాబాద్ అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ తారీక్ అన్సారీ ఈనెల 9న జిల్లా పర్యటనకు రానున్నారు. ఉదయం 10గంటలకు ఆయన జిల్లా అధికారులతో సమావేశం కానున్నారు. అనంతరం మధ్యాహ్నం 2గంటల వరకు మైనార్టీ వర్గాల నుంచి వినతిపత్రాలు స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం...

తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ హైదరాబాద్ వారు ఇందిరమ్మ మహిళాశక్తి పథకం ద్వారా ఉచిత కుట్టు మిషన్‌లను అందజేయనున్నారని, అర్హులైన వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారిణి కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని క్రిష్టియన్ మైనార్టీ మహిళలు ఈనెల 4 నుంచి 20 వరకు టీజీవోబీఎంఎంఎస్.సిజీజీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఫటా..ఫట్...

భూ సమస్యల ఫిర్యాదులపై తక్షణ పరిష్కారం

● పోతంగల్ తహసీల్దార్ మల్లయ్య



పోతంగల్ మండల పరిధిలో రెవెన్యూ పరంగా వచ్చిన ప్రతీ ఫిర్యాదును పరిశీలించిన తక్షణమే పరిష్కారిస్తున్నట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

తహసీల్దార్: పోతంగల్ మండలంలో మంజీర పరివాహక ప్రాంతాలలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు రెవెన్యూ, పోలీసు సిబ్బందితో కలిసి ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేశాము. రాత్రివేళ ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తూ ఇసుక అక్రమ కట్టడికి చర్యలు తీసుకుంటున్నాము.

ఆంధ్రజ్యోతి: మండలంలో ధరణి ఎన్ని పరిష్కరించారు?

తహసీల్దార్: మండలంలో భూసమస్యల పరంగా వంద ఫిర్యాదులు వచ్చాయి. ఇప్పటికే సబ్ కలెక్టర్, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి 90కి పైగా సమస్యలను పరిష్కరించాము.

ఆంధ్రజ్యోతి: కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులు ఎన్ని పంపిణీ చేశారు?

తహసీల్దార్: గత సంవత్సరంలో కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులు కొంత మేర పంపిణీ చేశాము. మరికొన్ని ఎమ్మెల్యే స్థాయిలో పెండింగ్‌లో ఉన్నాయి.

● (ఆంధ్రజ్యోతి,పోతంగల్)

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి

భీమ్‌గల్, జనవరి6(ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని ఎస్సై మహేష్ సూచించారు. సోమవారం భీమ్‌గల్‌లోని ప్రధాన కూడళ్లలో రోడ్డు భద్రత వారోత్సవాలను నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై అబ్దుల్‌సత్తార్, సిబ్బంది గంగాధర్, గోపాల్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని బోధన్ ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్ అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని జూనియర్ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది, అధ్యాపక బృందం తదితరులున్నారు.

మోటఫ్ న్యూమో వైరస్‌పై అవగాహన

సాలూర,జనవరి6(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని ఖాజాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు చైనా దేశంలో విజృంభిస్తున్న హ్యూమన్ మోటాఫ్ న్యూమో వైరస్‌పై పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజ్‌కుమార్ అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఎంటీ వైరస్ శ్వాసకోశ వైరస్ లాగా ఉంటుందన్నారు. శీతాకాలంలో జలుబు మరియు ఫ్లూ వంటి లక్షణాలను కలిగిస్తుందని, పిల్లల్లో, వృద్ధుల్లో ఈ ప్రమాదం ఎక్కువగా ఉండే అవకాశం ఉందన్నారు. జాగ్రత్తగా ఉండాలన్నారు. దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు కండువాలను అడ్డుగాపెట్టుకోవాలన్నారు. చేతులను సబ్బుతో కడుక్కోవాలన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శోభ, ఉపాధ్యాయులు లక్ష్మణ్, సాయిలు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సుంకినిలో ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోటగిరి,జనవరి6(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలోని సుంకిని గ్రామంలో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. సోమవారం ఉదయం మంజీర నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టీమ్ ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్లపై చర్యల నిమిత్తం రవాణా శాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు ట్రాక్టర్ యాజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మాక్లూర్, జనవరి6(ఆంధ్రజ్యోతి): మాక్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాంధీ నగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సంపంగి సాయిలు(42) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మృతుడు సాయిలు దాస్‌నగర్‌కు చెందిన వాడు కాగా ఆదివారం మోటర్‌సైకిల్‌పై నందిపేటకు కూలీ పనికి వెళ్లి తిరిగి వస్తుండగా గాంధీనగర్ రాత్రి సమయంలో ఎదురుగా వస్తున్న మోటర్‌సైకిల్ ఢీకొట్టడంతో తీవ్రగాయాలు కాగా అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలి ంచగా అపస్మారక స్థితిలో ఉన్న సాయిలు మృతి చెందాడు. మృతుడు భార్య లత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కిసాన్ సమ్మాన్ నిధి పెంపుతో రైతుల్లో హర్షం

మద్నూర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పీఎం కిసాన్ సంబంధించిన మొత్తాన్ని రూ.6 వేల నుంచి రూ.పది వేలకు పెంచుతున్నట్లు పీఎం నరేంద్రమోది చేసిన ప్రకటనతో రైతుల్లో ఆనందం వెల్లి విరుస్తుంది.

● కొత్తగా పట్టా చేసుకున్న రైతులకు ఏది సమ్మాన్...

నాలుగేళ్ళుగా ఇప్పటి వరకు 18 విడతలుగా ఏటా రూ.ఆరు వేలను మూడు దఫాలుగా జమ చేసింది. 2019 నుంచి కేంద్రం నిబంధనలను సడలించకపోవడంతో కొత్తగా పట్టాలు పొందిన రైతులకు సాయం అందదం, 2019 ఫిబ్రవరి వరకు పట్టాదారు పాస్ పుస్తకం ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, ఆదాయపు పన్ను చెల్లింపు దారులను మినహాయించి మిగిలిన పట్టాదారు రైతులకు కిసాన్ సమ్మాన్ జాబితాలో చేర్చారు. ఒకే కుటుంబంలో ఇద్దరు వ్యక్తుల పేరిట భూములు ఉంటే ఒక్కరికి వర్తింజే స్తున్నారు. పట్టాదారు మరణిస్తే ఆ భూమిని విరాసత్ చేసుకున్న వారికి తిరిగి పథకాన్ని వర్తింపజేస్తున్నారు. తమ అవసరాల రీత్యా లబ్ధిదారులు భూములను విక్రయిస్తే ఆ భూములు కొనుగోలు చేసిన వారికి వర్తింపజేయకపోవడంతో ఏటా లబ్ధిదారుల సంఖ్య తగ్గుతుంది. అదే విధంగా సమ్మాన్ నిధిపై అమలుపై కేంద్ర ప్రభుత్వం విధించిన అంక్షలు సంగతి ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

బోధన్ పట్టణ శివారులో ఆటో బోల్తా

● డ్రైవరు మృతి.. విద్యార్థులకు స్వల్ప గాయాలతో సురక్షితం

బోధన్‌రూరల్,జనవరి6(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణ శివారులో సోమవారం రాత్రి ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడడంతో షేక్ గౌస్(38) అనే ఆటో డ్రైవర్ మృతి చెందగా ఆటోలో ఉన్న నలుగురు విద్యార్థులు స్వల్ప గాయాలతో సురక్షితంగా బయటపడిన సంఘటన చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించింది బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపిన వివరాల ప్రకారం బోధన్ పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 10వ తరగతి చదివే విద్యార్థులు ట్యూషన్ ముగించుకుని తమ స్వగ్రామామైన పెగడాపల్లికి ఆటోలో ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడిందన్నారు. ఈ ప్రమాదంలో డ్రైవర్ గౌస్ అక్కడికక్కడే మృతి చెందగా ఆటోలో ఉన్న నాలుగురు విద్యార్థులు స్వల్ప గాయాలతో సురక్షితంగా బయట పడ్డారు. ప్రమాద ఘటన తెలుసుకున్న పట్టణ సీఐ హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు.ఘటనస్థలంలో మృతి చెందిన షేక్ గౌస్ మృతదేహన్ని బోధన్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు.

సంవత్సర కాలంలో 55వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



నవీపేటలో విద్యార్థులతో మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నవీపేట,జనవరి6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఒక సంవత్సర కాలంలోనే 55వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడం జరిగిందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో 72మందికి కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం జడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు వారానికి మూడు గుడ్లు ఇవ్వాల్సి ఉండగా బిల్లులు రావడం లేదన్న నెపంతో వాటిని అందించకపోవడం సరికాదన్నారు. హస్టల్‌లో చదివే విద్యార్థులకు 40శాతం భోజన మెస్ చార్జీలు పెంచి ఇవ్వడం జరిగిందని, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయల కల్పనకు కృషి చేస్తున్నామని అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు అంతిరెడ్డి రాజిరెడ్డి, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్ర కుమార్, శ్రీనివాస్ గౌడ్, రాజేందర్ గౌడ్, మహిపాల్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, మోస్రా సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా చెల్లించాలని కోరుతూ బీఆర్ఎస్ నిరసన



వేల్పూర్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నవీపేట,జనవరి6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఎకరాకు 15వేల రూపాయల చొప్పున రైతు భరోసా అందిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు ఎకరాకు రూ.12వేల చొప్పున మాత్రమే చెల్లిస్తామని పేర్కొనడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు రైతులకు ఎకరాకు రూ.15వేల చొప్పున రైతు భరోసా చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ వెంకట రమణకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సింగరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేల్పూర్: సీఎం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రైతు భరోసా కింద రూ.15వేలు, రూ.2లక్షల రుణమాఫీ చేయాలంటూ సోమవారం వేల్పూర్ మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ ఎస్ నాయకులు నిరసన తెలిపారు. ఈ సంద ర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ తెలం గాణ రైతాంగాన్ని కాంగ్రెస్ అన్ని విధాల నమ్మక ద్రోహం చేసిందని, రైతులకు ఇచ్చిన ప్రధాన హామీలు నెరవేర్చకుండా తీరని ద్రోహం రేవంత్‌రెడ్డి చేశారని ఆరోపించారు. అనంతరం తహ సీల్దార్ సంతోష్‌కు మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్య కర్తలు, పాల్గొన్నారు.

మెండోర: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు రైతులకు రైతు భరోసా ఇచ్చిన మాట ఎక్కడికి పోయిందని, ఇచ్చిన మాట ప్రకారం నెరవేర్చాలని డీసీసీబీ డైరెక్టర్ నాగంపేట్ శేఖర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు వివేకానంద విగ్రహం ఎదుట బీఆర్ఎస్ శ్రేణులు నిరసన తెలిపి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రతీ రైతుకు భరోసా సాయం కింద ఎకరానికి రూ.15వేలు ఇస్తామని హామీ ఇచ్చి నేడు రూ.12వేలు ఇస్తామనడం సిగ్గుచేటని, నేటి వరకు రాష్ట్రంలో ఏ ఒక్క రైతు బాగుపడిన దాఖలాలు లేవని, నాడు రైతులకు ఇచ్చిన మాట ప్రకారం డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తలారి గంగాధర్, నవీన్‌గౌడ్, మచ్చర్ల రాజారెడ్డి, కమలాకర్, గోపిడి గంగారెడ్డి, ఏలేటి శ్రీనివాస్, కొప్పెల సాయన్న, రాజు, దేవేందర్, బాబా, అక్తర్, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: గత ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఎకరాకు 15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తు సోమవారం కమ్మర్‌పల్లి జాతీయ రహదారిపై మండల బీఆర్ ఎస్ నాయకులు ధర్నా చేపట్టారు. ధర్నా కార్యక్రమంలో నాయకులు బద్దం చిన్నారెడ్డి, కలేరి శేఖర్, బద్దం రాజేశ్వర్, గడ్డం స్వామి, పిప్పెర అనీల్, సామ బాపురెడ్డి, నరేందర్, మహేందర్, ఉన్నారు.

సంక్రాంతి పండుగకు ప్రత్యేక బస్సులు

బోధన్‌రూరల్,జనవరి6(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసిందని బోధన్ ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం బోధన్ ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగకు సొంత ఊళ్లకు వెళ్లే వారి కోసం టీజీఎస్ ఆర్టీసీ నిజామాబాద్ రీజినల్ ప్రత్యేక ఏర్పాట్లు చేసిందన్నారు. ప్రయాణికులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరేందుకు జిల్లాలో 444ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించిందన్నారు. దూర ప్రాంతాలకు, ఆంధ్ర ప్రాంతానికి వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం బోధన్ డిపో నుండి హైదరాబాద్, విజయవాడ వరకు స్పెషల్ బస్సులను ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 9వ తేది నుండి 12వ తేది వరకు, 16వ తేది నుండి 20వ తేదీ వరకు ఈ ప్రత్యేక బస్సులు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయన్నారు. సంక్రాంతికి నడిపే పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్లు, తమ ప్రయాణ సమయంలో మహిళలు ఆధార్ కార్డు చూపించి జీరో టిక్కెట్లు తీసుకోవాలని తెలిపారు. ప్రత్యేక బస్సులను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంక్రాంతి పండుగను సురక్షితమైన బస్సుల్లో ప్రయాణించి తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

సంక్రాంతి పండగకు 444 ప్రత్యేక బస్సులు

పెర్కిట్: సంక్రాంతి పండగ రద్దీని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం నిజామాబాద్ రీజియన్ ఆధ్వర్యంలో ప్రయాణికులకు వివిధ గ్రామాలు, ఆంధ్ర ప్రాంతానికి వెళ్లడానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయను న్నట్లు నిజామాబాద్ రీజినల్ మేనేజర్ జోష్న తెలిపారు. ఈనెల 9నుంచి 12వ తేదీ వరకు, 16నుంచి 20వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నడపుతున్నామని ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం




బాల్కొండలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన కాంగ్రెస్ నాయకులు

రెంజల్: ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలలో భాగంగా రైతు భరోసాను 12వేలకు పెంచుతూ ఉపాధి హామీ కూలీలకు సంవత్సరానికి 12వేలు ఇవ్వలని కెబినెట్‌లో తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మొబిన్ ఖాన్ ఆధ్వర్యంలో సాటాపూర్ చౌరస్తాలో సోమవారం సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వీట్లు పంచి పెట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే తప్పనిసరిగా నెలవేరుస్తుందన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకునే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. ప్రజల సంక్షేమమే పరమాధిక పని చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సదా రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సాయిరెడ్డి, సాయిబాబా గౌడ్, జావీదోద్దీన్, గాయస్, ఎంఎల్ రాజు, బోధన్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కార్తీక్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గైని కిరణ్, నాయకులు ఒడ్డెక్కొళ్ల మోహన్, రవి, రవీందర్ గౌడ్, రమేష్, వినోద్, యోగి, ఖుద్దుస్, షంషోద్దీన్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: చరిత్రలో ఎవరు ఆలోచించని విధంగా భూమిలేని నిరుపేదలకు రూ.12వేల ఆర్థిక సహయం ఎంతో హర్షనీయమని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం మం డల కేంద్రంలో తెలంగాణ ప్రజాప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా భూమిలేని నిరుపేదలకు ఏడాదికి రూ.12వేలు ఆర్థిక సహయం ప్రకటిం చడంతో బాల్కొండ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణి గ్రామంలో మిషన్ భగీరథ నీటి కష్టాలు

● ఆందోళనలో గ్రామస్తులు ● పట్టించుకోని అధికారులు



భగీరథ వాటర్ ట్యాంక్

ఎల్లారెడ్డి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండలంలోని కళ్యాణి గ్రామంలో మిషన్ భగీరథ నీరు అందడం లేదని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. గ్రామానికి రెండు వాటర్ ట్యాంకులు ఉన్నప్పటికీ గ్రామపంచాయతీ ఆవరణలో ఉన్న భగీరథ వాటర్ ట్యాంక్‌కు మెట్లకు రిలే లేకపోవడంతో పాటు శిథిలావస్థకు చేరడంతో వాటర్ ట్యాంకు నిండిన తర్వాత ఓవర్ ఫ్లో నీటితో పక్కనే ఉన్ననివాసాల పైన నీరు పడుతుంద ని, ఆనీటితో నివాసాలు దెబ్బతింటున్నాయని బాధితులు ఫిర్యాదు చేయడంతో అది కారులు నీటి సరఫరా నిలిపివేశారు. దీంతో గ్రా మానికి సరిపడా నీరు అందడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికా రులు స్పందించి ట్యాంకుకు మరమ్మత్తులు నిర్వహించి మిషన్ భగీరథ నీటిని సప్లై చేసి గ్రామానికి సరిపడా నీటిని విడుదల చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

దోమకొండ, (బీబీపేట) జనవరి 6(ఆంధ్రజ్యోతి):దోమకొండ మండల కేంద్రంలోని పలుగడ్డ పాఠశాల, బీబీపేట మండలంలోని యాడారం గ్రామంలో సోమవారం వర్డ్ సంస్థ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. కౌమార దశశిక్షణ కార్యక్రమంలో భాగంగా 8,9,10 తరగతులకు చెందిన బాల, బాలికలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు శ్రీవిద్య, వంశీక్రిష్ణ, ప్రధానోపాధ్యాయులు రాజేంద్ర ప్రసాద్, వెంకట్‌రెడ్డి,విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయిని కాల్చివేసిన ఎక్సైజ్ అధికారులు

జక్రాన్‌పల్లి, జనవరి6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడకల్ గ్రామంలో గల ఫ్రీ మెడికల్ ఫ్యాక్టరీలో పట్టుకున్న 527.67కిలోల ఎండు గంజాయితో పాటు 3.6కిలోల అల్ప్రోజలం కాల్చివేసినట్టు ఎక్సైజ్ అధికారులు కె.మల్లారెడ్డి తెలిపారు. సోమవారం ఎక్సైజ్ అధికారులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. భీమ్‌గల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 3.67కిలోల గంజాయిని పట్టుకుని నాలుగు కేసులు నమోదు చేశామని తెలిపారు. బోధన్ ఎక్సైజ్ పరిధిలో 300కిలోల గంజాయి, నిజామాబాద్ ఎక్సైజ్ పరిధిలో 220కిలోల గంజాయి, 3.6కిలోల అల్ప్రోజలం, మోర్తాడ్ ఎక్సైజ్ పరిధిలో .21 కిలోల గంజాయిని, ఆర్మూర్ ఎక్సైజ్ పరిధిలో రెండు కిలోల గంజాయిని పట్టుకొని కాల్చివేసినట్టు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న డీఈ వి.రాజేశ్వర్‌రావు

ఆర్మూర్‌టౌన్, జనవరి6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిరాయత్‌నగర్ విద్యుత్ కార్యాలయంలో సోమవారం టీఈఈ 1104 యూనియన్ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను డీఈ వి.రాజేశ్వర్‌రావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ డివిజన్ అధ్యక్షుడు ఎం.సంజీవ్, ప్రధానకార్యదర్శి నరేందర్‌నాయక్, ప్రదీప్, గంగారాం, సురేష్‌బాబు, షకీల్, నాగభూషణం, ఉత్తమ్, హరిశంకర్, లక్ష్మణ్‌గౌడ్, సంతోష్, మహిపాల్, భూమేష్, సిద్దయ్య, శంకర్, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్: వేల్పూర్ మండలం టీపీయుసీ ఆధ్వర్యంలో సోమవారం నూతన సంవత్సర టీపీయుసీ క్యాలెండర్, డైరీలను ఎంఈవో రేణుక ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల టీపీయుసీ అధ్యక్షుడు రవి చందర్, కార్యదర్శి అజయ్, జిల్లా ఉపాధ్యక్షుడు శివాజీ, హెచ్‌ఎంలు రాజన్న, వైద్యగణేష్, శ్యామ్‌చరణ్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని జడ్పీహెచ్‌ఎస్ నాళేశ్వర్ పాఠశాలలో సోమవారం క్యాలెండర్లను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో బినోల సొసైటీ చైర్మన్ హన్మాండ్లు, మాజీ సర్పంచ్ సరిన్, ప్రవీణ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీదీప్, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

● బీఎల్‌టీయూ ఆధ్వర్యంలో

తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.సిద్దిరాములు తదితరులున్నారు.

హైదరాబాద్‌కు తరలిన టీఎన్‌జీవోస్

కామారెడ్డిటౌన్,జనవరి 6(ఆంధ్రజ్యోతి):కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ వద్ద నుంచి సోమవారం టీఎన్‌జీవోస్ హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగులందరు సంవత్సరానికి ఒకసారి జరుపుకునే డైరీ ఆవిష్కరణ పండుగకై హైదరాబాద్‌లోని నాంపల్లిలో గల లలిత కళాతోరణంను తరలుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ జిల్లా ప్రధానకార్యదర్శి నాగరాజు,చక్రధర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ సమావేశంలో పలు తీర్మానాలు

వేల్పూర్, జనవరి6(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండల పీఆర్‌టీయు కార్యవర్గ సమావేశం మండల పీఆర్‌టీయు అధ్యక్షుడు బోడ దేవనందం అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సమా వేశంలో మండల ప్రధానకార్యదర్శి సీపీ.నర్సింహరావు, పీఆర్‌టీయు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు టి.హరిచరణ్, సీహెచ్.కాంతయ్య, పఠాని గంగాధర్, దేవరాజ్, మండల అసోసియేట్ అధ్యక్షుడు రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రెంజల్,జనవరి6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో అడ్మిషన్‌లు పొందుటకు ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఫిరోజ్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు అడ్మిషన్‌ల కొరకు ఈనెల 6 నుంచి ఫిబ్రవరి 28వ తేది వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఎస్సీఎస్టీ, బీసీ టీడబ్ల్యూఎస్ విద్యార్థులకు రూ.125, ఇతర విద్యార్థులకు రూ.200 ఫీజు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని కోరారు.పరీక్షలకు సంబంధించిన హల్‌టిక్కెట్లను ఆన్‌లైన్‌లోనే ఏప్రిల్ 3వ తేది నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని, 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఏప్రిల్ 13వ తేదీన అడ్మిషన్ పరీక్షలు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఉపాధ్యాయుల కోసం విద్యార్థుల ధర్నా

● సముదాయించిన విద్యాశాఖ అధికారి



విద్యార్థులతో మాట్లాడుతున్న మండల విద్యాశాఖ అధికారి

బోధన్‌రూరల్,జనవరి 6(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థినులు సోమవారం ధర్నా చేపట్టారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెలో భాగంగా కేజీబీవీ టీచర్లు సమ్మెలో ఉన్నారు. దీంతో సోమవారం ప్రభుత్వం విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా తాత్కాలికంగా ఇతర పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను సర్దుబాటు చేసింది. ఈ క్రమంలో పాఠశాల విద్యార్థినులు తమకు పాఠాలు చెప్పే పాత టీచర్లు రారు అనుకుని తమ టీచర్లే కావాలని డిమాండ్ చేస్తూ పాఠశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న మండల విద్యాశాఖ అధికారి నాగయ్య పాఠశాలకు చేరుకుని విద్యార్థినులను సముదాయించి ధర్నా విరమింపజేశారు. దీంతో తరగతి గదులకు విద్యార్థినులు వెళ్లిపోయారు.

నందిపేటలో క్యాన్సర్ నిర్ధారణ శిబిరం



పలుగుట్ట ఆశ్రమంలో మహిళలకు పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

నందిపేట, జనవరి 6(ఆంధ్రజ్యోతి):నందిపేట మండల కేంద్రంలోని పలుగుట్టపై రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్, కృష్ణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (క్రిమ్స్), శ్రీ కేదారేశ్వర ఆశ్రమం ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం మహిళలకు ఉచిత రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహించారు. డాక్టర్ క్రిపా బజాజ్ ఆధ్వర్యంలో శ్రీ కేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు శ్రీ మంగి రాములు మహరాజ్ శిబిరాన్ని ప్రారంభించారు. పలువురు మహిళలకు డాక్టర్‌లు మహిళలకు ఉచితంగా రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు మంగి రాములు మహరాజ్‌ను సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ కార్యదర్శి గంగారెడ్డి, కార్యనిర్వహణ అధికారి డాక్టర్ నవీన్‌మాలు, బీరెల్లి నర్సింగ్ రావు, కిమ్స్ పీఆర్వో కరుణాకర్,ప్రతినిధులు, ట్రస్ట్ సభ్యులు,సిబ్బంది తదితరులు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం స్థల పరిశీలన

ఆర్మూర్‌టౌన్, జనవరి6(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో 24వార్డులో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలించినట్లు ఏఈ మౌనిక తెలిపారు. కాలనీలో లోవోల్టేజీ సమస్య ఉండడంతో పలువురి ఫిర్యాదు మేరకు స్థలాన్ని పరిశీలించి నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తామని ఆమె తెలిపారు. ఆమె వెంట స్థానిక కౌన్సిలర్ ఆకుల రాము, కాలనీవాసులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బోధన్‌రూరల్,జనవరి6(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో మంగళవారం విద్యుత్‌కు అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ నాయిని కృష్ణ తెలిపారు. ఫీడర్ మెంటనెన్స్‌లో భాగంగా 33/11 కేవీ చెక్కి స్టేషన్ పరిధిలోని 11కేవీ, ఆజాంగంజ్ పరిధిలోని కాలనీలు, ఆర్టీసీ కాలనీ, గంజ్ మెయిన్ రోడ్డు, మార్కెట్ రోడ్డు, పోలీస్ స్టేషన్ ఏరియా, షర్బత్ కెనాల్ ఏరియాల్లో ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఈ సందర్భంగా కోరారు.

సంతలో దొంగతనం

భీమ్‌గల్, జనవరి6(ఆంధ్రజ్యోతి): భీమ్‌గల్ పట్టణంలో సోమవారం జరిగే సంతలో రెండు దొంగతనాలు జరిగినట్లు ఎస్సై మహేష్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కుప్కాల్ గ్రామానికి చెందిన బాబానగర్ నర్సు సంతలో కూరగాయలు తీసుకుంటుండగా కవర్‌లో పెట్టుకున్న రూ.20 వేలను గుర్తుతెలియని దొంగలు దొంగిలించారని,అలాగే పల్లికొండ గ్రా మానికి చెందిన గంధం సుప్రియ సంతకు వచ్చి విజయదుర్గా సిల్వర్ మ ర్చంట్ పేరు గల బ్యాగ్‌లో అర్థతులం విలువ చేసే బంగారు కమ్మలు గల బ్యాగును పక్కన పెట్టి అంగల్లో కూరగాయలు తీసుకుంటు ఉండగా బ్యాగు ను గుర్తు తెలియని దొంగలు దొంగిలించారని బాధితులు తెలిపారు.బాధి తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్మూర్‌లో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

ఆర్మూర్‌రూరల్, జనవరి6(అంధ్రజ్యోతి): రాష్ట్ర అంగన్‌వాడి టీచర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్మూర్ పట్టణంలో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షురాలు పి.చంద్రకళ ఆవిర్భావ దినోత్సవ జెండాను ఎగురవేశారు. అనంతరం సీఐటీయు మండల కన్వీనర్ కుతాడి ఎల్లయ్య మాట్లాడుతూ ఎన్నికల సందర్భంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి గోదావరి, అరుణ, లక్ష్మీ, జగదాంబ, భారతి, తదితరులు పాల్గొన్నారు.

చేపూర్‌లో మత్స్యకారులకు చిక్కిన 25కేజీల చేప

ఆర్మూర్‌రూరల్, జనవరి6(ఆంధ్రజ్యోతి):ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామంలోని ఊరచెరువులో సోమవారం మత్స్యకారుల వలలో 25కేజీల చేప చిక్కింది. గత కొన్నేళ్లుగా తమ జీవనాధారమైన చేపల వృత్తి చేస్తున్నప్పటికీ ఇంత పెద్ద చేప తమకు చిక్కడం ఇదే మొదటిసారి అని మత్స్యకారులు పేర్కొన్నారు. వెంటనే చేపను తూకం వేయగా 25కేజీల వచ్చిందని మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేశారు.



చేపూర్‌లో మత్స్యకారులకు చిక్కిన 25కేజీల చేప

కలగానే డిచ్‌పల్లి మున్సిపాలిటీ

● ప్రతీ సారి ఎన్నికల సమయంలో మున్సిపాలిటీ ఏర్పాటుపై ప్రకటనలు

● అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోని రాజకీయ పార్టీలు



డిచ్‌పల్లి మండల కేంద్రం

డిచ్‌పల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లిని మున్సిపాలిటీగా చేస్తాన ని అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్లక్ష్యం చేస్తున్నారు. నిజామాబాద్ రూర ల్ నియోజకవర్గానికి ప్రధాన కేంద్రంగా ఉన్న డిచ్‌పల్లి మండల కేంద్రం రోజురోజుకు అభివృద్ధి చెందుతోంది. ఇక్కడ తెలంగాణ యూనివర్సిటీతో పాటు, ఏడో పోలీస్ బెటాలియన్, సీఎంసీ మెడికల్ కళాశాల, ప్రైవేట్ న ర్సింగ్ కళాశాలలు, డిచ్‌పల్లి మండల కేంద్రంలో రైల్వే స్టేషన్‌తో పాటు జా తీయ రహదారి 44కూడా మండల కేంద్రం గుండా వెళ్తుంది. ఇన్ని సౌకర్యా లు ఉండటంతో చుట్టూ పక్కల మండలాలతో పాటు పలు రాష్ట్రాలకు చెం దిన ప్రజలు తమ వ్యాపారాల రీత్యా డిచ్‌పల్లిలో స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో రోజురోజుకు డిచ్‌పల్లి విస్తీర్ణం పెరుగుతూ పో తోంది. అందుకు సరిపడా ప్రజలకు మౌలిక సదుపాయలు కల్పించాల్సిన పంచాయతీలకు సామర్థ్యం సరిపోకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతు న్నాయి. విద్యాపరంగా డిచ్‌పల్లి ఒక హబ్‌గా ఏర్పడింది. త్వరలోనే ఇక్కడ మెడికల్ కళాశాల రానుందని ఇప్పటికే టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ ప్రకటించిన విష యం తెలిసిందే. అన్నిరంగాల్లో ముందు కెళ్తున్న డిచ్‌పల్లిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం సైతం జోరు గా సాగుతుంది. లే అవుట్లు, వెంచర్‌ల లో భారీగా డిమాండ్ ఏర్పాడింది. జిల్లా కేంద్రానికి కూత వేటు దూరం ఉండటం అన్ని వసతులు డిచ్‌పల్లి ప్రాం తంలో ఉండటంతో జనాలు సైతం డిచ్‌పల్లిలో ఉం డటానికి ఇష్టపడుతున్నారు. డిచ్‌పల్లి మండల కేం ద్రంతో పాటు నడిపల్లి, అమృతపూర్, సుద్దపల్లి, ఘ న్‌పూర్, ఖిల్లా డిచ్‌పల్లి పోలీస్ క్యాంప్, ముల్లంగి ఇలా అన్ని గ్రామాలు కలిసినట్టుగానే ఇక్కడ ఉంటా యి. డిచ్‌పల్లిని మున్సిపాలిటీగా చేస్తే మరింత అభివృద్ధి చెంది ఇక్కడి ప్రజలకు మౌలిక సదు పాయాలు పూర్తి స్థాయిలో కల్పించాలని డిచ్‌పల్లి వాసులు కోరుతున్నారు. ఈ విషయంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ చొరవ తీసుకోవాలని ఆయన సైతం గతంలో ఇదే డిచ్‌పల్లి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. కావున చొరవ తీసు కోవాలని, స్థానిక ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ము న్సిపాలిటీ ఏర్పాటు చేయించాలని స్థానికులు పేర్కొంటున్నారు.

బాజిరెడ్డి కృషి చేసినా

అడ్డుపడ్డ స్థానిక బీఆర్ఎస్ నాయకులు

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జిల్లాలో భీమ్‌గల్ మున్సిపాలిటీతో పాటు డిచ్‌పల్లిని మున్సిపాలిటీగా చేయాలని ప్రతిపాదనలు ఉన్నా అది సాధ్యం కాలేదు. డిచ్‌పల్లి మండలంలోని కొందరు బీఆర్ఎస్ స్థానిక నాయకులు మున్సిపాలిటీ చేయొద్దని, మున్సిపాలిటీ చేస్తే గ్రామాల్లో తమ రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని, తమ రియల్ వ్యాపారానికి ఇ బ్బందులు వస్తాయని అదేవిధంగా గ్రామీణ ప్రజలు తీవ్ర అవస్థలు పడు తారని అప్పటి ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌పై ఒత్తిడి తీసుకరావడంతో ఆయన సైతం స్తబ్దుగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. అప్పటి నుంచి డిచ్‌పల్లి మున్సిపాలిటీ ఏర్పాటు కలగానే మారింది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి విజయం సాధించారు. రాష్ట్రంలో సైతం కాంగ్రెస్ అధికారంలో ఉన్నందున డిచ్‌పల్లిని మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని ఇక్కడి స్థానికులు కోరుతున్నారు.


డిచ్‌పల్లి గుండా వెళ్తున్న 44వ జాతీయ రహదారి



మద్నూర్ నుంచి ఇరుముడితో బయలుదేరినర అయ్యప్ప స్వాములు

శబరిమల అయ్యప్ప దర్శనానికి స్వాముల పయనం

● ఇరుముడులతో ఆలయాల్లో సందడి

మద్నూర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వాములు మండల దీక్ష (41 రోజులు) అనంతరం ఇరుముడి కట్టుకొని మణికంఠుడి దర్శ నార్థం కేరళ రాష్ట్రంలోని శబరిమలైకి బయలుదేరి వెళ్లారు. పల్లె నుంచి పట్టణం వరకు అయ్యప్ప మాల ధరించి దీక్ష చేపట్టిన భక్తులు వారి కుటుంబ సభ్యులచే ఆలయాల్లో పూజలు, ఇరుముడులతో సందడి వాతా వరణం నెలకొంది. కార్తీక మాసం ప్రారంభం నుంచి మకర సంక్రాంతి పూర్తయ్యే వరకు అయ్యప్ప స్వాముల దర్శనం శబరిమలలో నిరంతరం కొనసాగుతుంది. స్వాములు దీక్ష విరమించే వేల ఇరుముడి తప్పనిసరిగా కట్టుకుంటారు. స్వామి సన్నిధానం చేరుకున్న తర్వాతే ఈ ఇరుముడిని విప్పుతారు. దేవుని ఆత్మ పరమాత్మలను అనుసంధానం చేయడమే ఇరుముడిలోని ఆంతర్యమని పండితులు చెబుతున్నారు. భక్తి, శ్రద్ధ అనే రెండు భాగాలు కలిగిన ఇరుముడిలోని తొలి భాగంలో కొబ్బరికాయలోని నీటిని తొలగించి పూర్తిగా నెయ్యితో నింపుతారు. పూజా సామాగ్రి పెడతారు. రెండో భాగంలో స్వాముల ప్రయాణానికి కావాల్సిన బియ్యం, పప్పు, పసుపు, కుంకుమ వంటివి పెడతారు. శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తుల్లో కన్నె స్వాములు, గురుస్వాములు ఇరుముడితో 18 మెట్ల గుండ వెళ్లి అయ్యప్ప స్వామిని దర్శించుకుంటారు. తద్వారా కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. సోమవారం మద్నూర్ మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన 65 మంది అయ్యప్ప స్వాములు ఇరుముడితో శబరిమలకు బయలుదేరి వెళ్లారు.

41 రోజుల దీక్షతో మానసిక ప్రశాంతత


ఇరుముడి కార్యక్రమంలో పూజలు చేస్తున్న జుక్కల్ ఎమ్మెల్యే

పెద్ద కొడప్‌గల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): 41 రోజుల పాటు ఆయా దీక్షలు చేపట్టేవారికి భక్తితో కూడిన ప్రశాంతత వస్తుందని జుక్కల్ ఎమ్మె ల్యే తోట లక్ష్మీకాంతారావ్ పేర్కొన్నారు. సోమవారం జుక్కల్ మండల కేం ద్రంలో అయ్యప్ప స్వాములు 41 రోజుల పాటు మాల ధరించి నియమ నిష్టలతో దీక్ష పూర్తి చేయడం అభినందనీయమని తెలిపారు. అంతేగాక దీక్ష పూర్తి చేయడం అనేది అందరికి సాధ్యం కాదని, భగవంతున్ని కృప ఉంటేనే దీక్ష సాధ్యమని తెలిపారు. 41 రోజుల పాటు మాలదారులు నియమనిష్టలతో ఉండటం వలన ఆరోగ్యం కూడ మెరుగవుతుందని, దీక్ష అనంతరం కూడా మాలదారులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండా లని సూచించారు. అనంతరం గురుస్వాములు శబరిమల వెళ్లే అయ్యప్ప లకు ఇరుముడి కట్టి ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత అయ్యప్పలు శబరిమల బయలుదేరారు. అనంతరం అయ్యప్ప సేవా సమితి ఆధ్వ ర్యంలో ఎమ్మెల్యే తోటను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

జుక్కల్ క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు వివిధ అనారోగ్య కారణాలు పలు ఆసుపత్రులలో చికిత్సలు చేయించుకున్న వారికి సిఎం సహాయనిధి ద్వారా వచ్చిన చెక్కులను క్యాంపు కార్యాలయంలో ఎమ్మేల్యే బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజ ల సంక్షేమం కోసం ఆలోచన చేసేది ఒక్క కాంగ్రెస్ పార్టీయే అని తెలి పారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన నా యకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిద్దులగుట్టపై ఘనంగా పల్లకీసేవ


సిద్దులగుట్టపై పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు

పెర్కిట్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సిద్దులగుట్టపై ఆల య కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పల్లకీసేవ, ప్రత్యేక పూజలు నిర్వ హించారు. సిద్దులగుట్టకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి శివాలయం లోని సిద్దేశ్వరునికి పంచామృతాలతో, బిల్వపత్రాలతో అభిషేకం చేశారు. నందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లకీసేవలో భక్తులు, భజన మండలి సభ్యులు పాల్గొని నృత్యాలు చేస్తూ భక్తిగీతాలు అల పిం చారు. వన్నెల్(బి) గ్రామానికి చెందిన ఏనుగు లతిక రాజేష్‌రెడ్డి దం పతులు గుట్టపై విచ్చేసిన భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఈ కా ర్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పీసీ.గంగారెడ్డి, బి.సుమన్, కోడిగెల మల్లయ్య, పొద్దుటూరి చరణ్‌రెడ్డి, బోండ్ల ఆనంద్, ప్రశాంత్‌గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

యాసంగి పంటకు

నిజాంసాగర్ నీటిని పొదుపుగా వాడుకునేలా చూడాలి

● వచ్చే జూన్ నాటికి నిజాంసాగర్‌లో ఆరు టీఎంసీల నిటి నిల్వ ఉండేలా చూసుకోవాలి

● తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి సాధించాలి

● రాష్ట్ర వ్యవసాయ ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): యాసంగి పంటకు నిజాంసాగర్ ప్రాజెక్టులోని నీటిని పొదుపుగా వాడుకునేలా ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధి కారుల సమన్వయంతో ముందుకు వెళ్లాలని వ్యవసాయ ప్రభుత్వ సలహా దారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. సోమవారం బాన్సువాడ ప ట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ, ఇరి గేషన్ శాఖల అధికారుల సమీక్ష సమావేశంలో ఆగ్రోస్ ఛైర్మన్ కాసుల బాల రాజుతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ నిజాంసాగర్ నీటి విడుదలపై సమీక్ష సమావేశం నిర్వహిం చడం జరిగిందని యాసంగి పంటకు నీటిని పొదుపుగా వాడుకుని తక్కువ నేటితో ఎక్కువ దిగుబడి సాధించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అంతేకాకుండా వర్షాకాలం జూన్ నాటికి నిజాంసాగర్ ప్రాజెక్టులో ఆరు టీఎంసీలు నీటి నిల్వ ఉండేలా చూడాలని రైతాంగానికి సాగునీటి విడుదల చేసేందుకు సిద్ధంగా ఉంచాలన్నారు. రెండో విడత నేటి విడుదలకు సిద్ధం అవ్వడం జరిగిందని, పది రోజులకు ఒకసారి నీటిని వి డుదల చేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి డిస్ట్రిబ్యూటర్ వద్ద నీరు వృ థా పోకుండా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఇద్దరు సిబ్బందిని నియ మించి సమన్వయంతో నీటిని పొదుపుగా వాడుకునేలా చర్యలు తీసు కోవా లని ఆయన తెలిపారు. అంతేకాకుండా సిద్దాపూర్, జాకోర ఇతర పెండింగ్ పంపు హౌస్‌లో పనులు త్వరలో పూర్తిచేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన అధి కారులకు సూచించారు. ఏదేమైనా వర్షాకాలం నాటికి నిజాం సాగర్ ప్రాజెక్టులో ఆరు టీఎంసీ ల నీటిని నిల్వ ఉంచాలని ని ర్లక్ష్యం వహించకూడదని ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్ర మంలో సబ్ కలెక్టర్ కిర ణ్మయి, వికాస్ మెహత, ఇరిగేషన్ జిల్లా అధికారి శ్రీనివాస్, నియో జకవర్గంలోని 9 మండలాల తహసీల్దార్లు, ఇరిగేషన్ ఏఈ లు సిబ్బంది తదితరులు పాల్గొ న్నారు.


బాన్సువాడలో అధికారులతో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం

టీయూ లైబ్రరీలో దాహం.. దాహం

● నీటి కొరతతో విద్యార్థులకు తీవ్ర ఇక్కట్లు



టీయూ లైబ్రరీలో కాలిపోయిన బోరు మోటారు


లైబ్రరీలో పనిచేయని ప్లాంట్

డిచ్‌పల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) టీయూ సెంట్రల్ లైబ్రరీలో గత 20 రోజులుగా తాగు నీరు లేక విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు పడు తున్నట్లు విలే కర్లతో విద్యార్థులు తెలిపారు. గ్రంథాలయం పక్కనే తాగునీటిని అందించే బోరులోని మోటారు కాలిపోయిన వర్సిటీ అధికారులు తమకేమి పట్టన్నట్లు వ్యవహరిస్తున్నరని టీయూ గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు సంతోష్ నాయక్ ఆరోపించారు. లైబ్రరీ లోని మినరల్ వాటర్ ప్లాంట్ నీరు లేక మూలన పడిందని తాగు నీటిపై లైబ్రేరియన్‌ను అడిగితే తమకు డొంక తిరుగుడు సమాధానా లు ఇస్తున్నరని ఆయన ఆరోపించారు. పోటీ పరీక్షలకు సిద్దమవు తున్న విద్యార్థులకు తాగునీటి సమస్య జఠిలంగా మారిందని వెంటనే అధికారులు బోరు మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేస్తున్నా రు. అదేవిధంగా లైబ్రెరిలో వైఫై రావడం లేదని, ఈ సేవల కోసం ప నులు చేశామని చెబుతున్న ఇంత వరకు వైఫై రావడం లేదని తక్షణ మే వైఫై పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మౌలిక సదుపాయ ల విషయంలో వీసీ యాదగిరి రావును విద్యార్థి సంఘాలు అడిగితే కసురుకుంటున్నా రని బంజార విద్యార్థి సంఘం నాయకులు శ్రీను నాయక్ తెలిపారు. విద్యార్థి సంఘాల నాయకుల ఫోన్‌లను వీసీ ఎత్త డం లేదని వీసీ నిర్లక్ష్యంగా పనిచేయడం సరికాదని ఇలా నిమ్మకు నీరెత్తినట్లు పనిచేస్తే విద్యార్థులంతా వర్సిటీలో ఆందోళనలు చేస్తా మని హెచ్చరించారు.

మున్సిపల్ కమిషనర్ పరిశీలన

ఆర్మూర్‌టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల రీ వెరిఫికేషన్, అంగన్‌వాడి సెంటర్‌లను, కొటా ర్మూర్ చెరువును మున్సిపల్ కమిషనర్ రాజు సోమవారం పరిశీ లించారు. మున్సిపల్ పరిధిలో 6, 7, 23వార్డులలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల రీ వెరిఫికేషన్‌తో పాటు అంగన్‌వాడి సెంటర్‌లను సందర్శించి హాజరుపట్టికను పరిశీలించారు. అలాగే కొటార్మూర్ లోని చెరువును ఆయన పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ అధికారులు, ఇరిగేషన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మినుము పంటకు తెగులు


మినుము పంటకు బూడిద తెగులు సోకిన దృశ్యం


మారుక మచ్చలు ఆశించిన పంట

మద్నూర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రా మాల్లో రైతులు సాగు చేస్తున్న మినుము పంటకు తెగుళ్ల ఆశిం చడంతో రైతులు దిగులు చెందుతున్నారు. ప్రస్తుతం మినుము పంట పూత, కాయ ఏర్పడే దశలో ఉందని, మినుము పంటలో మారుకా మచ్చల పురుగు, బూడిద తెగుళ్ల గమనించడంతో రైతు లు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై వ్యవసాయ విస్తీర్ణ అధికారి అనిల్ రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ మారుక మచ్చల పురుగును గమనించినట్లయితే ఇది పూత దశ నుంచి తర్వాత కాయలు ఎదిగే దశ వరకు ఆశించి ఎక్కువ నష్టం కలిగిస్తుందనీ కాయల లోపల ఉండి నష్టం కలిగిస్తుందని సూచిం చారు. ఈ పురుగు ఉధృతి నివారణకు ఎకరాకు ఫ్లూ బెండమైడ్ 40 మీ.లీ లేదా రైనాక్సీ ఫెయిర్ 60 మీ.లీ లేదా స్పైనో శాడ్ 70 మి.లీ అనే మందులను ఒకటి తర్వాత ఒకటి మార్చి పిచికారి చే యాలని అదేవిధంగా మినుము పంటలో బూడిద తెగుళ్లను గ మనించడం జరిగిందని, ఈ బూడిద తెగుళ్ల ముఖ్యంగా రాత్రి వేళలో చలిగాను పగటిపూట వేడిగాను ఉన్నప్పుడు బూడిద తెగు ళ్ల ఉధృతి పెరుగుతుందని ఈ తెగుళ్ల లక్షణాలు గమనించిన ట్లయితే తెల్లని బూడిద లాంటి పొర కాయల మీద ఆకుల మీద పిందెల మీద ఏర్పడడం వల్ల మొక్కలలో కిరణ జన్య సంయోగ క్రియ తగ్గిపోయి తగినంత ఆహార పదార్థాలు తయారు కాక దిగు బడులు తగ్గడమే కాక గింజ నాణ్యత కూడా తగ్గుతుందని సూచించారు. ఈ తెగుళ్ల ఉధృతి గమనించిన వెంటనే కార్బన్ డిజమ్ 200 గ్రాములు ఎకరాకు లేదా డైనోకాప్ 200 మి.లీ ఎకరాకు అనే మందులను పిచికారి చేసుకోవాలి. రైతులు తాము సాగు చేస్తున్న పంటలపై వ్యవసాయ విస్తీర్ణ అధికారులతో సల హాలు సూచనలు తీసుకోవాలని అన్నారు.

సాగు భూములకు రూ.12 వేల రైతు భరోసా

● పంట పండే భూములకే సాగు సాయం

● హర్షం వ్యక్తం చేస్తున్నరైతులు


పంట సాగు చేస్తున్న రైతు

మద్నూర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా పథకం కింద రైతులకు ఏటా ఎకరా నికి రూ.12 వేల చొ ప్పున పెట్టుబడి సా యం అందజేస్తామని రాష్ట్ర ముఖ్య మంత్రి ప్రకటించడంతో మ ద్నూర్ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ అమలు చేసిన రైతు బంధు పథకంలో సాగుతో సంబంధం లేకుం డా పాస్ బుక్‌లో ఉన్న అన్ని రకాల భూములకు సాగు సాయం అందించారు. దాంతో విలువైన ప్రజా ధనం వృథా అయిందని కాం గ్రెస్ ప్రభుత్వం విమర్శించింది. గతంలో సాగు భూములతో పాటు సాగులు లేని భూములు, కొండలు, కలిగి ఉన్నాయి. కొన్ని భూము ల పాస్ పుస్తకాలు, రెవెన్యూ రికార్డుల్లో ఉన్న వాస్తవానికి ఆయా రైతులకు వాస్తవంగా ఆ భూముల్లేవు. ఇలాంటి పరిస్థితుల్లో గత ప్రభుత్వం ధరణి ఆధారంగా రైతు బంధు అమలు చేయడంతో వేల కోట్ల నిధులు వృథా అయినట్లు ఆరోపణలు వచ్చాయి. సాగు భూమి లేకపోయినా రైతుగా భావించి ఎకరానికి రూ.10 వేల చొ ప్పున రైతు బంధు అందించారనే ఆరోపణలు ఉన్నాయి. అలా కా కుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరానికి రూ.12 వేల చొప్పున పెట్టు బడి సాయం అందజేస్తామని ప్రకటించింది.

● రైతు భరోసాలో మార్పులు

కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బంధు పథకాన్ని రైతు భరోసాగా సాయం అందించేందుకు సిద్ధమైంది. రూ.12 వేల సాగు సాయం లో భాగంగా జనవరి 26 నుంచి అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. అదేవిధంగా భూమి లేని వ్యవసాయ కుటుంబాలకు ఇం దిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏటా రూ.12 వేల చొప్పున ఆర్థిక సాయం చేస్తామని సీఎం ప్రకటించారు. దాంతో పాటు రేషన్ కా ర్డులు లేని వారందరికీ నూతన రేషన్‌కార్డులు ఇస్తామని ప్రకటిం చారు.

ప్రధాన రహదారి పక్కనే వ్యర్థాలు

●దుర్వాసనతో ముక్కు మూసుకుంటున్న జనం

●ఎల్లారెడ్డిలో వ్యర్థాలను రోడ్డు పక్కనే పారబోస్తున్న చికెన్ సెంటర్ నిర్వాహకులు

● పట్టించుకోని మున్సిపల్ అధికారులు

ఎల్లారెడ్డి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ శివారులోని బా న్సువాడ ఎల్లారెడ్డి ప్రధాన రహదారి పక్కన సోమార్‌పేట్ వెళ్లే రోడ్డు పక్కన వ్యర్థాలు పారబోయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో వాహన దారులు, ప్రజలు ఉదయం వాకింగ్ వెళ్లే వారు, అటువైపు ఆదర్శ పాఠశాల కూడా ఉండడంతో ప్రతీ రోజు విద్యార్థులు ప్రజలు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీకి 1406 సర్వే నంబర్ డంపింగ్ యార్డు ఉన్నప్ప టికీ మున్సిపల్ కార్మికులు రోడ్డు పక్కన వేసి చేతులు దులుపుకుంటున్నారు. అంతేకాకుండా చికెన్ సెంటర్ నిర్వాహకులు సైతం వ్యర్థాలను ప్రధాన రహ దారి పక్కనే పోయడంతో వీధి కుక్కలు అటువైపు గుంపులుగా ఏర్పడి రో డ్డుపై వెళ్లే వాహనదారులపై, బాట సారులు వెళ్లే వారిపై దాడికి పాల్పడుతు న్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరు బయట చెత్త వేయ రాదని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన కొందరు పెడచెవిన పెడు తు న్నారే అనే విమర్శలు ఉన్నాయి. మున్సిపల్ అధికారులు చెత్తను సేకరించి డం పింగ్ యార్డుకు తరలించాలని, అదేవిధంగా చికెన్ సెంటర్ నిర్వాహకులు చికె న్ వ్యర్థాలను రోడ్డు పక్కన పారబోయకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు బాటసారులు, విద్యార్థులు కోరుతున్నారు.


ఎల్లారెడ్డి ప్రధాన రహదారి పక్కనే చికెన్ వ్యర్థాలు, గుంపుగా మారిన కుక్కలు



రోడ్డు పక్కనే చెత్తను పోస్తున్న మున్సిపల్ కార్మికులు

● అధికారులు చర్యలు తీసుకోవాలి

ఉదయం 5.30 గంటలకు చాలామంది పట్టణ ప్రజలు బాన్సువాడ - ఎ ల్లారెడ్డి ప్రధాన రహదారి వైపు వాకింగ్ కోసం వెళుతుంటారు. తర్వాత విద్యార్థులు పాఠశాలల సమయానికి అటువైపు బాటసారులు సైతం ఎక్కువ ఎక్కువగా రాకపోకలు సాగుతుంటాయి చికెన్ వ్యర్థాలకు వీధి కుక్కలు గుంపు లుగా ఏర్పడి బాటసారులపై దాడికి పాల్పడుతున్నాయి అంతేకాకుండా దు ర్వాసన వెదజల్లుతోంది అధికారులు తగిన చర్యలు తీసుకొని రోడ్డు వైపు వేయకుండా చూడాలి.

- వెంకటేశం, స్థానికుడు ఎల్లారెడ్డి

ఇందిరమ్మ ఇళ్లకు నిధులు పెంచాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

నిజామాబాద్ అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లకు నిధులు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. పేదలకు ఇళ్లు కట్టుకునేందుకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రూ.5లక్షలతో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా మరో రూ.5లక్షలు కలిపి రూ10 లక్షల ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దివెంకట్రాములు డిమాండ్ చేశా రు. ఇందిరమ్మ ఇళ్ల కోసం సర్వే పైపైనే జరుగుతుందని అన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు కూడా మంజూరు చేయాలని ఆయన కోరారు. ఉపాధి హామీ పథకం పని దినాలను కూడా పెంచాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉపాధ్యక్షుడు గోలం లక్ష్మి, సహాయ కార్యదర్శి గోవర్ధన్, బోన్ల లక్ష్మినర్సయ్య, చంద్రకాంత్, నర్ర లావణ్యలు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

డొంకేశ్వర్, జనవరి6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మారంపల్లి గ్రామానికి చెందిన అడ్డి గంగయ్యకు రూ.17వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరు కాగా సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గొడిసెరం భూమేష్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు గంగాధర్, ప్రసాద్; సుంకరి నాగరాజు, లింబాద్రి, కాంతరావు, రాజేశ్వర్, సురేందర్, కృష్ణ, రాజన్న, పరమేశ్వర్, గంగాధర్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

కోటగిరి,జనవరి6(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలని బీజేపీ ఓబీసీ నాయకులు మక్కయ్య డిమాండ్ చేశారు. పోతంగల్ మండల కేంద్రంలో సోమవారం బీజేపీ నాయకులు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను తక్షణమే అమలు చేయాలన్నారు. బీసీ రిజర్వేషన్ అమలు చేయకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు భజరంగ్, శంకర్, గోవింద్, హరి పటేల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

నిజామాబాద్ అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి):ఎన్నికల్లో ఇచ్చిన రైతు భరోసా హామీ మేరకు రైతులకు ఎకరాకు రూ.12వేలు రైతుభరోసా, భూమిలేని పేదలకు రూ.12వేలు అందజేయనున్నట్లు ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, నుడా చైర్మన్ కేశవేణు ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం వద్ద క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హుందాన్, ముప్పగంగారెడ్డి, అంతిరెడ్డి రాజారెడ్డి, తదితరులు హాజరై పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో రత్నాకర్, జావిద్ అక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

రేపు టీఎన్‌జీవో జిల్లా స్టాండింగ్ కౌన్సిల్ సమావేశం



మాట్లాడుతున్న టీఎన్‌జీవో అధ్యక్షుడు సుమన్

నిజామాబాద్ అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): టీఎన్‌జీవో జిల్లా స్టాండింగ్ కౌన్సిల్ సమావేశం ఈనెల 8వ తేదీ నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్, ప్రధాన కార్యదర్శి శేఖర్‌లు తెలిపారు. సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 8న శ్రావ్యగార్డెన్‌లో ఉదయం 10గంటలకు ఈ సమావేశం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవో నిజామాబాద్ జిల్లా నూతన డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, రాష్ట్ర టీఎన్‌జీవో అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం హుస్సేనీ, తదితరులు హాజరుకానున్నట్లు వారు తెలిపారు. జిల్లాలోని టీఎన్‌జీవో సంఘ నాయకులు, భాగస్వామ్య సంఘాల నాయకులు జిల్లా ఉద్యోగులు, మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో చిట్టినారాయణరెడ్డి, పోల శ్రీనివాస్, సంజీవయ్య, అతిక్ ఫైమద్, జాకీర్ హుస్సేన్, దినేష్‌బాబు, ఆకుల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఏబీవీపీ ఖేల్ ఉత్సవ్ వారోత్సవాలు

డిచ్‌పల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ తెలంగాణ యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 6 నుంచి 10 వరకు తెలంగాణ యూనివర్సిటీలో జరుగుతున్న ఖేల్ ఉత్సవ కార్యక్రమాన్ని విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ యువ దినోత్సవం సందర్భంగా, వివేకానంద జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న ఖేల్ ఉత్సవ్ కార్యక్రమాలు ఏబీవీపీ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు శివ, అమృతతాచారి, సాయికుమార్, మోహన్, పావని, సమీర్, అక్షయ్, అశోక్, లెనిన్, మహర్షి, నాగరాజు, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

చైనా మాంజా అమ్మితే చర్యలు

ఖిల్లా, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలోని ప్రజలు చైనా మాంజా వాడడం వలన ప్రజలకు, జంతువులకు ప్రమాదం వాటిల్లే ప్రమాదం ఉందని, చైనా మాంజా ఎవరైనా నిలువ ఉంచినా, తయారు చేసినా, అమ్మిన, అమ్మడానికి ప్రోత్సహించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని టాస్క్‌ఫోర్స్ సీసీఎస్ ఏసీపీ నాగేంద్రచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొంత మంది హైదరాబాద్ నుంచి నిజామాబాద్‌కు చైనా మాంజా తరలించినట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. ప్రమాదం కలిగించే చైనా మాంజాతో ఏదైనా ప్రమాదం జరిగినట్లయితే విక్రయదారులు కూడా అట్టి కేసుకు బాధ్యత వహించాల్సి ఉంటుందని నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా నిలువచేసిన, అమ్మిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఇప్పటి వరకు 10 కేసులపైన కేసు నమోదు చేయడం జరిగిందని అన్నారు. ఎవరైనా ఉపయోగిస్తున్నట్లు సమాచారం తెలిస్తే టాస్క్‌ఫోర్స్ ఏసీపీ 8712659812 నెంబర్‌కు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

● ప్రజావాణికి 122 వినతులు : కలెక్టర్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఇతర అధికారులు

నిజామాబాద్‌అర్బన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 122 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ అంకిత్, డీఆర్‌డీవో సాయాగౌడ్, నగర పాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్, మెప్మాపీడీ రాజేందర్, డీపీవో శ్రీనివాస్‌లకు విన్నవించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈకార్యక్రమంలో వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

● ఇందిరమ్మ నమూనా ఇంటితో కలెక్టరేట్‌కు...

రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అమలు చేయనున్న ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి నమూనా ఇంటిని జిల్లాకు చెందిన కళాకారుడు రమేష్ రూపొందించి కలెక్టరేట్‌కు తీసుకొని వచ్చాడు. సోమవారం ప్రజావాణి సందర్భంగా నమూనా ఇంటిని కలెక్టర్‌కు అందజేశారు. ప్రత్యేక షీట్‌తో రూపొందించిన ఇందిరమ్మ ఇంటి నమూనా ఆకట్టుకుంది.

● బఫర్ జోన్‌లో అక్రమంగా నిర్మాణం పై చర్యలు తీసుకోవాలి

వేల్పూర్ మండలం రామన్నపేట గ్రామంలో సర్వే నెంబర్ 44, 46లలో 6 గుంటల భూమి ఉందని దాని పక్కనే బర్కుంట చెరువు పక్కన బఫర్ జోన్‌లో 40బి/1, 40బి/2, 40బి/2/2, 41 సర్వే నెంబర్‌లో వ్యవసాయ భూమి నాలాగా మార్చి ఓపెన్ ప్లాట్లు చేసి అమ్ముతున్నారని దాని పక్కనే ఉన్న 44వ సర్వే నెంబర్ భూమిలో అక్రమంగా ప్రవేశించి కొంత భాగంలో నిర్మాణం చేశారని ఆ భూమిని తమ మామగారైన రాజారాం పేరుతో పహానీ ఉందని కొత్త పాస్‌బుక్‌లో ఇంకా నమోదు కాలేదని తమ భూమిని తమకు ఇప్పించాలని ఆ భూమిలో నిర్మాణం చేసుకుంటున్న వారికి అనుమతులు ఇవ్వవద్దని బాధితురాలు సత్యగంగు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు.

అంతర్జాతీయ సదస్సులో గుంజీళ్ల మాస్టారు

డిచ్‌పల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగరాజ్‌లో సంజీవిని వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నార్త్ సెంట్రల్ జోన్ కల్చరల్ సెంటర్‌లో ఈనెల 2 నుండి 6 వరకు నిర్వహించిన గ్లోబల్ ఆయుష్ మహాకుంభ్ సదస్సులో తెలంగాణ రాష్ట్ర నిజామాబాద్ వాసి రాష్ట్ర అవార్డు గ్రహిత ఇటీవల గుంజీళ్ళ మాస్టారుగా ప్రసిద్ధిగాంచిన అందె జీవన్‌రావు కృత్రిమ మేధతో కూడిన సూపర్ బ్రెయిన్ యోగా మెరుగైన జ్ఞాపకశక్తి మరియు సమాజ క్షేమం అంశంపై తన పరిశోధనా పత్రాన్ని సమర్పించి ప్రసంగించారు. సూపర్ బ్రెయిన్ యోగా అనేది గుంజీళ్ళ మెరుగైన విధానమని, ఈ యోగా వలన మెదడు చురుకుదనం పెరిగి జ్ఞాపకశక్తి మెరుగుపడుతుందని తాజా పరిశోధనలు తెలియజేస్తున్నాయని అన్నారు. ఆ పరిశోధనా వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఫిలిప్పైన్స్‌కు చెందిన ఆధునిక ప్రాణిక్ హీలిలింగ్ వ్యవస్థాపకుడు చౌ కాక్ సూయ్ గుంజీళ్ళపై అధ్యయనం చేశారని సూపర్ బ్రెయిన్ యోగా వలన మెదడు చురుకుదనం పెరిగి జ్ఞాపకశక్తి పెరుగుతుందని తేలిందని తెలిపారు. క్రమ పద్ధతిలో సూపర్ బ్రెయిన్ యోగా చేయడం వలన విద్యార్థులలో జ్ఞానము, ఏకాగ్రత, గుర్తుంచుకోవడం, అభ్యసనం, సమస్యా పరిష్కారం, మెరుగైన శ్రద్ధ, సృజనాత్మకత, ఆసక్తి, మానసికశక్తి, మానసిక సమతుల్యత, రోగ నిరోధక శక్తి మొదలైనవి పెంపొంది ఆందోళన నుండి ఉపశమనం కలుగుతుందని తెలిపారు. కృత్రిమ మేధను సూపర్ బ్రెయిన్ యోగాతో అనుసంధానించడం ద్వారా అద్భుతమైన ఫలితాలను సాధించవచ్చని జీవన్‌రావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జీవన్‌రావుకు ప్రయాగరాజ్ సంజీవిని వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులు మెమొంటోతో ఘనంగా సత్కరించారు.



సదస్సులో మాట్లాడుతున్న అందె జీవన్‌రావు

9న ఎస్‌ఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

నిజామాబాద్ అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలలో ఈనెల 9వ తేదీ గురువారం క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ మారయ్యగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10గంటల నుంచి క్యాంపస్ ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని తెలంగాణ అకాడమి ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ఆధ్వర్యంలో ఈ డ్రైవ్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రముఖ కంపెనీలలో సర్టిఫైడ్ ఇంటర్నెట్ కన్సల్టెంట్‌గా ఉద్యోగ అవకాశాల కోసం ఈ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన వారు ప్రస్తుతం ఫైనల్ ఇయర్ చదువుతున్న వారు అర్హులని ఆయన తెలిపారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే వారు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్లతో పాటు ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫోటోలతో హాజరుకావాలని ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రోబోటిక్ క్యాంప్ ప్రారంభం

మోపాల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మోపాల్ మండలం కంజర్ గ్రామంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల కళాశాలలో సోహెమ్ అకాడమి హైదరాబాద్ వారి రోబోటిక్ క్యాంపును నిర్వహించారు. సోహెమ్ డైరెక్టర్ కోమరగిరి సహదేవ్ భారతదేశం అంతా టెక్నాలజీ అభివృద్ధి చెందాలనే సదుద్దేశంతో అది విద్యార్థి దశ నుండే ప్రారంభం చేయించాలని అన్నారు. దానిలో భాగంగానే ప్రత్యేకంగా కొన్ని విద్యాలయాలను ఎంపిక చేసుకోవడం జరిగిందన్నారు. అందులో కంజర పాఠశాల ఎంపిక కావడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ జి.విజయలలిత హర్షం వ్యక్తం చేశారు. ఈ శిక్షణకు జోనల్ అధికారిణి ఫ్లోరెన్స్ రాణి స్వయంగా పర్యవేక్షించించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

భార్యపై భర్త కత్తితో దాడి

మోపాల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి):కుటుంబ కలహాలతో భార్య మౌనికపై భర్త గణేష్ కత్తితో దాడి చేసినట్లు ఎస్సై ఆరీఫ్ తెలిపారు. మోపాల్ మండలం ఠాణాకుర్దు గ్రామానికి చెందిన గణేష్ రూరల్ మండలం మల్లారం గ్రామానికి చెందిన మౌనికతో గత సంవత్సరంన్నర క్రితం వివాహంజరిగింది. వీరిద్దరి మధ్య కుటుంబ కలహాలు ఉండటంతో తల్లిగారి ఇంట్లో ఉన్న మౌనికపైభర్త గణేష్ ఆదివారం రాత్రి కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపర్చినట్లు ఎస్సై తెలిపారు.కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆరీఫ్ తెలిపారు

దొంగతనాలపై ప్రజలకు అవగాహన

మోపాల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): దొంగతనాలు జరుగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రూరల్ ఎస్సై ఆరీఫ్ మారుతీనగర్ కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. సోమవారం మారుతీనగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో దొంగతనాలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై ఆరీఫ్ మాట్లాడుతూ ఇతర ప్రాంతాలకు వెళ్లేముందు ఇంటి యజమానులు ముందుగానే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని అన్నారు. ఇంటి బయట లైట్లను కూడా ఉంచాలన్నారు. ఇంట్లో బంగారు, నగదును పెట్టి వెళ్లవద్దని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. రాత్రివేళల్లో పోలీసు బలగాలు పెట్రోలింగ్ చేస్తున్నారని అన్నారు.

డీఆర్‌డీఏ కార్యాలయంలో సమాఖ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో

నిజామాబాద్ అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఇందిర మహిళాశక్తి పథకం కింద క్యాంటీన్‌లు, మొబైల్ ఫిష్ కౌంటర్లు, దేశీకోళ్ల మదర్ యూనిట్‌లను ఏర్పాటు చేయాలని దీనికి అవసరమైన లబ్ధిదారులను గుర్తించి జాబితా పంపించాలని డీఆర్‌డీవో సాయాగౌడ్ అన్నారు. కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సెర్ప్ ద్వారా ఎడపల్లి మండలం జాన్కంపేటలో రెండు మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాట్‌ను ఏర్పాటు చేయనున్నామని అన్నారు. జిల్లాలోని మండల సమైఖ్య, గ్రామ సమైఖ్యలే సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు ముందుకు వస్తే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డీపీఎం సంధ్యారాణి, నీలిమ, సాయిలు, మారుతి, శ్రీనివాస్, శ్రీనిధి ఆర్‌ఎం రాందాసు, ఏపీఎం సరోజిని, జిల్లా సమైఖ్య అధ్యక్షురాలు రాధా, కార్యదర్శి లావణ్య, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా గురుగోవింద్ జయంతి



గురుగ్రంథీని పఠిస్తున్న దృశ్యం

నిజామాబాద్ కల్చరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సిక్కుల గురువైన గురు గోవింద్ జయంతి ఉత్సవాన్ని గురుద్వారా ప్రబంధ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని గురుద్వారాలో 358 జయంతిని ఘనంగా నిర్వహిం చారు. సిక్కుల గురువులు గురుగ్రంథీలను పఠించారు. గురుగోవింద్ అనుసరించిన మార్గంలో నడిచి సిక్కులు ఆనందమయ జీవితాన్ని అనుభవించాలని సూచించారు. నాందేడ్ నుంచి వచ్చిన ప్రత్యేక భజన బృందం భజనలు, కీర్తనలు ఆలపించారు. అనంతరం అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో సిక్కులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బియ్యంలో పురుగు రాకుండా చూడాలి



కొండూర్ హైస్కూల్లో బియ్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రవీందర్‌రావు

సిరికొండ జనవరి 6 (ఆంధ్రజ్యోతి) విద్యార్థుల కోసం ప్రభుత్వం అందించే బియ్యంలో పురుగు రాకుండా చూడాలని సిరికొండ తహసీల్దార్ రవీందర్‌రావు వంటచేసే ఏజెన్సీ వారిని కోరారు.మండలంలోని కొండూర్ హైస్కూల్లో తహసీల్దార్ తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో గుడ్లు వారానికి మూడు పెడుతున్నారా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.బియ్యంలో పురుగురాకుండా చూసుకోవాల్సిన బాధ్యత వంటచేస్తున్న వారి బాధ్యత అనిగుర్తు చేశారు.హెచ్ఎం స్టోర్‌కు వెళ్లి బియ్యం ఎలా ఉన్నాయో, సరిపోతాయా లేవాఅని చూసుకోవాల న్నారు.ప్రభుత్వ మెనూ ప్రకారం పౌష్టికాహరాన్ని అందించాలని తహసీల్దార్ కోరారు. పాఠశాలలో పిల్లలకు సౌకార్యలు బాగున్నా యా అని అడిగి తెలుసుకున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి రెండు రోజుల జైలు

మోపాల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బైపాస్ రోడ్‌లో ఆదివారం రాత్రి వాహనాలు తనిఖీ చేయగా లక్ష్మణ్ అనే వ్యక్తి మద్యం తాగి వాహనం నడపడంతో అతనికి రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్సై ఆరీఫ్ తెలిపారు. మద్యం తాగి వాహనదారులు నడిపితే వారిపై చట్టరిత్యా చర్యలు ఉంటాయని ఎస్సై ఆరీఫ్ హెచ్చరించారు. రూరల్ మండలంలోని ఆయా ప్రధాన ప్రాంతాల్లో ప్రతీరోజు వాహనాలను తనిఖీ చేయడం జరుగుతుందని తెలిపారు.

రిజిస్ట్రార్‌ను కలిసిన 2014 బ్యాచ్ అధ్యాపకులు

డిచ్‌పల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీలోని 2014 నియామకమైన అధ్యాపకులు సోమవారం రిజిస్ట్రార్ యాదగిరిని కలిశారు.ఈ సందర్భంగా రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు.తమకు పదోన్న తులు కల్పించే విషయంపై చర్చించినట్లు తెలిసింది. తమకు ఎలాగైన పదోన్నతులు కల్పించేలా సానుకూ ల మైన నిర్ణయం తీసుకోవాలని రిజిస్ట్రార్‌ను కోరినట్లు తెలిసింది.

తాగునీటి, వైఫై సమస్య పరిష్కరించాలని రిజిస్ట్రార్‌కు వినతి

డిచ్‌పల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని రోజులుగా తెలంగాణ యూనివర్సిటీ లైబ్రెరీలో నీటి సమస్య, వైఫై అంతరాయం ఉన్నందున విద్యార్థులకు తాగడానికి నీరు సరిగ్గా అందుబాటులో లేకపోవడం వల్ల లైబ్రెరీలో చదువుతున్న వివిధ పరీక్షల కోసం ప్రిపేర్ అవుతున్న విద్యా ర్థులకు అంతరాయం కలుగుతుందని సోమవారం టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరికి గిరిజన శక్తి ఆధ్వర్యంలో వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యను తక్షణమే పరిష్కరించి విద్యార్థులకు ఎటువంటి అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రార్‌ను కోరారు. రిజిస్ట్రార్‌ను కలిసిన వారిలో శ్రీను రాథక్లడ్, సంజు నాయక్, శ్రీకాంత్, శేఖర్, ముస్తఫా, తదితరులు ఉన్నారు.

తాళ్లతో చేతులు కట్టుకొని
సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన

నిజామాబాద్ అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ వద్ద సమ్మె చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు సోమవారం 31వ రోజు సమ్మెలో భాగంగా చేతులకు తాళ్లు కట్టుకొని సంకెళ్ల తెంచమంటూ వినూత్న నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయ్, ప్రసాద్, అంబదాస్‌రావు, అంజయ్య, రాజు, విద్యాసాగర్, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సిరికొండ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి):వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సిరికొండ ఎస్సై ఎల్.రామ్ కోరారు. రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా మండలంలోని కొండూరు గ్రామంలో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో యువకుల నుద్దేశించి మాట్లాడారు. వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రయాణించాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని అలా నడిపితే జరిమానా విధించడం జరుగుతుందని ఎస్సై చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

టీడీపీలోకి పలువురి చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న దేగాం యాదాగౌడ్

సుభాష్‌నగర్, జనవరి 6(ఆంధ్రజ్యోతి):తెలుగుదేశం పార్టీలోకి పలువురు చేరారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో టీడీపీ పార్లమెంటరీ కన్వీనర్ దేగాం యాదాగౌడ్, పట్టణ కన్వీనర్ అంబిక సత్యనారాయణ ఆధ్వర్యంలో పలువురు పార్టీలోకి చేరారు. మైనార్టీ నా యకులు రిజ్వాన్, తదితరులకు పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో వినోద్‌కుమార్, అంబిక సత్య నారాయణ, పురుషోత్తం, లవంగరాజు, ఇప్పలపల్లి విష్ణు, బాలాజీగౌడ్, నాగేశ్వర్‌రావు,ప్రభాకర్ పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల అపురూప కలయిక



ఎల్లారెడ్డిపల్లిలో పూర్వ విద్యార్థుల సమ్మేళన దృశ్యం

ఇందల్వాయి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామంలో 1995-96 సంవత్సరపు పూర్వవిద్యార్థుల అపురూప కలయిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. నాటి స్నేహితులు ఒకరికొకరు తీపి జ్ఞాపకాలను పంచుకున్నారు. 28 సంవత్సరాల తర్వాత అందరూ ఒకేతాటి పైకలవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. నాడు విద్య నేర్పిన గురువులకు పాదాభివందనం చేసి ఆశీస్సులు తీసుకొని శాలువాతో సన్మానించారు. చిన్ననాటి జ్ఞాప కాలను ఉపాధ్యాయులతో పంచుకున్నారు. ఎవరూ బాధలో ఉన్నా ప్రతి ఒక్కరూ సహాయం చేసుకోవాలని కలిసి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.160	రూ.275	రూ. 295
వెన్‌కాబ్(కిలో)	రూ.165	రూ.280	రూ. 300

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.79400	రూ.73250	రూ.930

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : పుష్ప-2 (10.20, 2.45)
: మార్కో (7.10)
: ముఫాసా (ఇంగ్లీష్ 3డి) (10.15)
స్క్రీన్-2 : ముఫాసా (తెలుగు 3డి) (11.00, 1.50, 4.40, 7.30)
: పుష్ప-2 (10.20)
స్క్రీన్-3 : మార్కో (11.05)
: పుష్ప-2 (హిందీ) (2.10)
: పుష్ప-2 (తెలుగు) (6.15)
: బేబిజాన్ (హిందీ) (10.40)
స్క్రీన్-4 : కార్వన్ ది హంటర్ (ఇంగ్లీష్) (11.00, 5.00)
: మార్కో (1.55, 10.50)
: కార్వన్ ది హంటర్ (తెలుగు) (7.55)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : మ్యాక్స్ (10.25, 1.20, 10.30)
: మార్కో (4.10)
: పుష్ప-2 (7.00)
స్క్రీన్-2 : ముఫాసా (11.00, 1.20)
: పుష్ప-2 (4.10)
: మార్కో (7.45, 10.30)
స్క్రీన్-3 : పుష్ప-2 (1.10, 10.00)
: ముఫాసా (తెలుగు 3డి) (5.00, 7.30)

దేవి : మార్కో (11.00, 2.00, 6.00, 9.00)
నటరాజ్ : మ్యాక్స్ (2.00, 9.00)
: కార్వన్ ది హంటర్ (11.00, 6.00)
విజయ్ : పుష్ప-2 (10.00, 2.00, 6.00, 10.00)
లలితామహల్ : యూఐ (11.00, 2.00, 6.00, 9.00)

- నిజామాబాద్ అర్బన్